క్లుప్తంగా

పశువులకు టీకాలు



జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామంలో శుక్రవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది వేశారు. సర్పంచ్ గోర్త పద్మ, ఉపసర్పంచ్ గోర్త రాజేందర్, మండల పశువైద్యాధికారి శిరీషా, రైతులు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



ఖలీల్‌వాడి: బీడీ కార్మికులందరికీ షరతులు లేకుండా జీవనభృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ 7న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో బీడీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ కోరారు. సుభాష్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 8లక్షల మంది బీడీ కార్మికులు సరైన ఉపాధి అవకాశాలు లేక, ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, జిల్లా ప్రధాన కార్యదర్శిరాజేందర్, అధ్యక్షులు కాంబ్లే మధు, నాయకులు ప్రవీణ్ సింగ్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



ఖలీల్‌వాడి: వరద ప్రాంతాల్లో సీఎం పర్యటించి, బాధితులను తక్షణ సహాయం అందించి, ఆదుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్ది సూరి డిమాండ్ చేశారు. నగరంలోని పాత గంజ్ ప్రాంతంలో శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందన్నారు. బాధితులకు ప్రభుత్వం సహాయం చేయకపోవడం బాధకరమన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10లక్షల వరకు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, రాములు, సుజాత, కృష్ణ, నర్సయ్య, అనుసుజ, కళావతి, విశాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు శిక్షణకు హాజరవ్వాలి

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయులు తొలిమెట్టు శిక్షణ కార్యక్రమానికి హాజరవ్వాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులందరూ తప్పకుండా శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. ఎంఈవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల అరెస్ట్, విడుదల



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ముదక్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోగల 12 మంది సెకండ్ ఏఎన్‌ఎంలను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వారు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మెడికల్ ఆఫీసర్, టీఆర్‌ఎస్‌కేవీ నాయకులు పోలీస్‌స్టేషన్ చేరుకుని ఎస్‌ఐరాముకు సమస్యను వివరించారు. మధ్యాహ్నం తర్వాత సొంత పూచీకత్తుపై వారిని పోలీసులు విడుదల చేశారు.

బీజేపీ మాజీ నగర కార్యదర్శి భూమేష్ అనారోగ్యంతో మృతి

సుభాష్‌నగర్: బీజేపీ నగర మాజీ కార్యదర్శి బొమ్మరి భూమేష్ (53) శుక్రవారం సాయంత్రం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. దీంతో బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతదేహానికి నివాళ్లు అర్పించారు. స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

నందిపేట పోలీస్ స్టేషన్ తనిఖీ

నందిపేట్: నందిపేట్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఏసీపీ జగదీష్ చందర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతకుముందు ఏసీపీని ప్రజాప్రతినిధులు సన్మానించారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమైనవి



డిచ్‌పల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు



ముదక్‌పల్లిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

- డిచ్‌పల్లి వైద్యాధికారి సంతోష్
- పలు మండలాల్లో తల్లిపాల వారోత్సవాల నిర్వహణ

డిచ్‌పల్లి: బిడ్డకు తల్లిపాలు శ్రేష్టమైనవని, అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రిపాలు పట్టించడం ద్వారా బిడ్డ ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని మండల వైద్యాధికారి సంతోష్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ మాతా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఖచ్చితంగా రూట్‌లెవల్‌లో ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇన్‌చార్జి సీడీపీవో స్వర్ణలత, శంకర్, రాంబాబు పాల్గొన్నారు.

నగరంలో..

నిజామాబాద్ సిటీ: నగరంలోని వినాయక్‌నగర్ పీహెచ్‌సీ కేంద్రంలో శుక్రవారం మెప్మా సహకారంతో తల్లిపాల విశిష్టతపై సామూహిక సమావేశం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి, తల్లిపాలు పట్టకపోవటంతో పిల్లలకు, తల్లులకు జరిగే నష్టాలపై చర్చించారు. సీడీపీవో సౌందర్య, మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మోపాల్ మండలంలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లి, ఆర్యనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జకీరా బేగం, మెడికల్ ఆఫీసర్ సంతోష్ కుమార్ కార్యక్రమాల్లో పాల్గొని, మాట్లాడారు. బిడ్డ పుట్టగానే తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీలు రాజ్యలక్ష్మీ, సువర్ణ, గంగామణి, ఏహెచ్‌ఓ లక్ష్మీ, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



నగరంలో యువకులకు కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీ యువకులతోనే బలోపేతం అవుతుందని, దీనికి అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం 20వ డివిజన్ మాజీ కౌన్సిలర్ లింగం కుమారుడు వికాస్, 100 మంది యువకులతో కలిసి సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ మంత్రి పార్టీ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ వైపు తెలంగాణ ప్రజలు చూస్తున్నారని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షులు కేశవేణు, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బీన్ హందాన్, గడుగు గంగాధర్, అంతిరెడ్డి రాజారెడ్డి, సంతోష్, సాయిలు, కిషన్ పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలోని సీతాయిపేట్ తండాకు చెందిన 50మంది యువకులు శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాట్‌పల్లి నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. నాయకులు ఆర్మూర్ బాలరాజ్, బాల్‌నర్సయ్య, రాకేష్, నర్సయ్య పాల్గొన్నారు.



సీతాయిపేట్ తండాలో యువకులకు కాంగ్రెస్ కండువా కప్పుతున్న నగేష్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

జక్రాన్‌పల్లి: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యాధికారిణి లలిత సూచించారు. మండలంలోని మాదాపూర్‌లో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల పడకల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయుష్ విభాగం కరదీపికలను ఆవిష్కరించారు. సర్పంచ్ చిన్న లింగన్న, ఉపసర్పంచ్ అశమ్మ, కార్యదర్శి ప్రవీణ్, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

నడిపల్లిలో..

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి గ్రామంలో శుక్రవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ కులాచారి సతీష్ శిబిరాన్ని ప్రారంభించి, వైద్యాధికారి మాధవి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది మురళి, శివకృష్ణ, సుజాత ఉన్నారు.

సోయా పంటలో నీరు నిల్వ ఉండొద్దు



ఖండ్‌గాంలో మాట్లాడుతున్న అధికారులు

బోధన్: సోయా పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ రైతులకు సూచించారు. మండలంలోని కల్దుర్కి, సిద్దాపూర్, ఖండ్‌గాం గ్రామాల్లో శుక్రవారం ఆయన వివిధ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాలు తగ్గిన తర్వాత సోయా పంటకు ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను వేయాలని సూచించారు. ఏడీఏ సంతోష్, ఏఈవోలు ఉన్నారు.

పంటల పరిశీలన..

నందిపేట్: మండల కేంద్రంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పరిహారం కోసం బాధిత రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను ఏఈవో కార్యాలయంలో ఇవ్వాలని ఏవో జ్యోత్స్న భవాని సూచించారు. అధికారులు అనూష, విజయ్, గంగాధర్, వీడీసీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'తొలిమెట్టు' శిక్షణ



బోధన్‌లో మాట్లాడుతున్న ఎంఈవో నాగ్‌నాథ్

బోధన్: పట్టణంలోని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. భాష పరిజ్ఞానం, గణితం అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా తొలిమెట్టు కార్యక్రమం అమలుకు ప్రణాళిక రూపొందించబడిందని పేర్కొన్నారు. డీఆర్‌పీలు హన్మాండ్లు, శివకుమార్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలకేంద్రంలో శుక్రవారం తొలిమెట్టు గణిత శిక్షణ శిబిరాన్ని ఎంఈవో వనజ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో వినియోగించాలని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అడిషనల్ ఎస్పీ'కి సన్మానం

ఖలీల్ వాడి: ఏసీపీ ప్రభాకర్ రావు పదోన్నతిపై జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ గా వెళ్లడంతో శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని శ్రావణ్ గార్డెన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సిహెచ్ ప్రవీణ్ కుమార్, అదనపు సీపీ ఎస్ జయ్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.

10న కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

సిరికొండ: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా నిర్వహిస్తున్నట్లు తపస్ ఇందూరు జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాను విజయవంతం చేయాలన్నారు. సభ్యులు గంగాధర్, మోతీలాల్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ మహరాజ్ జన్మదిన వేడుకలు



నిజామాబాద్ సిటీ: ఇందూర్ జిల్లా పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆచార్య బాలకృష్ణ మహరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వినాయక్‌నగర్ సంకట విమోచన హనుమాన్ మందిరంలో యోగా శిక్షకులు వివిధ రకాల 100 ఔషధ మొక్కలను నాటారు. పతంజలి యోగ సమితి జిల్లా ప్రభారి తొర్తి బుచ్చన్న, మహిళ పతంజలి సమితి దొండి సునీత, బీఎస్‌టీ ప్రభారి అంజనేయులు, యువ ప్రభారి రంజిత్ పాల్గొన్నారు.

ఇందల్వాయి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ఇందల్వాయి: ఇందల్వాయి తహసీల్దార్‌గా వెంకట్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ టీవీ రోజా బదిలీపై కామారెడ్డి జిల్లాకు వెళ్లారు. అదే జిల్లాలో విధులు నిర్వహించిన వెంకట్‌రావు బదిలీపై ఇందల్వాయికి వచ్చారు.

హరిశ్చంద్రుడి విగ్రహం ఆవిష్కరణ

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామం వైకుంఠ ధామంలో శుక్రవారం సత్యహరిశ్చంద్రుడి కాటికాపరి విగ్రహాన్ని సర్పంచ్ రూప సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ విగ్రహాన్ని, ఐదు బెంచీలు వితరణ చేశారు. ఈసందర్భంగా గంగాధర్‌ను వారు సన్మానించారు. ఎంపీటీసీ సంతోష్, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



ఖలీల్‌వాడి: రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు స్టేవిధించడంపై మాజీ మేయర్ సంజయ్, పార్టీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌భవన్‌లో టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబురాలు జరుపుకున్నారు. పార్టీ నేతలు ప్రమోద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు 'డిజిటల్ సామగ్రి' అందజేత



ఇందల్వాయి: మండలంలోని గౌరారం గ్రామ పూర్వ నివాసి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఏనుగు సురేందర్‌రెడ్డి శుక్రవారం తన పుట్టిన రోజు సందర్భంగా గౌరారం ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రొజెక్టర్, మానిటర్, కంప్యూటర్ తదితర సామగ్రిని అందించారు. జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు, ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ జగన్, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



సుభాష్‌నగర్: నగరంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో 50 మంది విద్యార్థులకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, దాత్రిక రమేష్, రెబ్బ ఆనంద్, వసుధ ఫౌండేషన్ జిల్లా ఇన్‌ఛార్జి పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులపై వేధింపులు సరికాదు



వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

నిజామాబాద్‌నాగారం: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులపై అధికారులు వేధింపులకు పాల్పడటం సరికాదని, వెంటనే వేధింపులను ఆపాలని సీఐటీయూ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన యూనియన్ ఆధ్వర్యంలో డీఈవోకు వినతిపత్రం అందజేశారు.

గోవర్ధన్ మాట్లాడుతూ.. బడుల్లో కొత్త మెనూ అమలు పేరుతో, ఉదయం రాగి జావా అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులపై హెడ్మాస్టర్లు వేధింపులకు గురి చేస్తున్నారని, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ అమలు కోసం బడ్జెట్ కేటాయించకుండా, స్లాబ్ రేటు పెంచకుండా ఏ విధంగా అమలు చేయాలని ప్రశ్నించారు. కొత్త బడ్జెట్ వచ్చేవరకు పాత పద్ధతుల్లోనే వంట చేస్తామన్నారు. కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్, నాయకులు సురేందర్ రెడ్డి, శిరీష, సుమలత, శేఖర్, తుకారాం, మహమూద, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో 12న వైద్య శిబిరం



సిరికొండ: మండల కేంద్రం ఈనెల 12న తూంపల్లి గ్రామానికి చెందిన హెల్పింగ్ హర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ తెలిపారు. శిబిరం ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌ను శుక్రవారం ఆయన ఆహ్వానించారు. నాయకులు మహేందర్, హరీష్, వినోద్, రాజేందర్, రవి, జీవన్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులకు రుణాలు మాఫీ చేయడాన్ని హర్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఎంపీపీ కుంచాల విమల రాజు, పార్టీ మండల అధ్యక్షుడు నట్ట బోజన్న, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సాయి ఆలయంలో హరితహారం



నిజామాబాద్ సిటీ: నగరశివారు మాధవనగర్ సాయిబాబా మందిరంలో శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా వర్షాకాలంలో ఆలయంలోకి వరద నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఈవోను ఆదేశించారు. ఈవో రవీందర్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నిజామాబాద్ సిటీ: నగరంలో పలు గణేష్ ఆలయాల్లో శుక్రవారం సంకష్ట చతుర్థి పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రీ శుభం కరోతి కల్యాణ గణపతి ఆలయంలో మహా యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే రఘునాథ ఆలయం వద్ద గణేష్ మందిరంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్మిక గర్జన సభకు తరలిన బీడీ కార్మికులు



ధర్పల్లి: భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం చేపట్టిన కార్మిక గర్జన సభకు ధర్పల్లి మండల బీడీ కార్మికులు, ఐఎఫ్‌టీయూ నాయకులు తరలి వెళ్లారు. నాయకులు రమేష్, బాబన్న, దామోదర్, లింబయ్య, రాజేశ్వర్, బీడీ కార్మికులు తదితరులు ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,100	వెండి (కిలో)	76,800
22 క్యారెట్స్	56,332	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	100	130	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	70
జీరకాయ	60	80	దోసకాయ	20	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	17	30
జిర్నిసుకాయ	100	130	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	35	50
వంకాయ	30	50	బీట్‌రూట్	35	50
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	40	60	చామగడ్డ	40	60
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	60
పుదీనా	70	100	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	60	80			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	బ్లడ్ అండ్ చాకోల్-10.50 బ్రో (తెలుగు)- 1.40,4.40,7.30, 10.30
స్క్రీన్-2	మెగ్-2(ఇంగ్లీష్)- 11.00,4.40, 10.40 బేబి-2023(తెలుగు)-1.30 ఎల్.జి.ఎమ్ - 7.40
స్క్రీన్-3	సూర్య సన్‌ఆఫ్ కృష్ణన్ (తెలుగు)- 10.25,1.30,4.30,10.30 బేబి-2023(తెలుగు)- 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	బ్రో(తెలుగు)-11.00,4.50 7.45,10.40
స్క్రీన్-2	మెగ్-2(తెలుగు)3డీ-10.45, 1.25 ఎల్.జి.ఎమ్(తెలుగు)-4.05 మెగ్-2(ఇంగ్లీష్)3డీ-7.20,10.00
స్క్రీన్-3	రాఖీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కాహానీ (హిందీ)-10.05,7.00, 10.35 కృష్ణగాడు అంటే ఒక రేంజ్(తెలుగు)-1.40 మిస్టేక్(తెలుగు)-4.35
స్క్రీన్-4	బేబి(తెలుగు)-11.10, 6.30 ఓపెన్ హైమర్(ఇంగ్లీష్)-2.40 ఎల్.జి.ఎమ్(తెలుగు)- 10.00
దేవి	బ్రో (తెలుగు)
నటరాజ్	మెగ్-2(తెలుగు)
లలితామహల్	ఎల్.జి.ఎమ్
విజయ్	బేబి